క్లుప్తంగా

నేడు, రేపు ఓటరు జాబితాపై ప్రత్యేక క్యాంపెయిన్

జగద్గిరిగుట్ట: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 26, 27 (శని, ఆది వారాలలో) అన్ని పోలింగ్ స్టేషన్లలో క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు తెలిపారు. ఆయా సెంటర్లలలో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు లిస్టులో పేరు, కొత్త ఓటరు కోసం 6-బీ, మార్పులు చేర్పుల కోసం 8-బీ ఫామ్‌లు తదితర విషయాలపై స్పష్టంగా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. తుది జాబితాకు ముందు నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగించుకోవాలన్నారు. అలాగే సెప్టెంబర్ 2, 3వ తేదీలలో కూడా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్‌లో voters.epic.gov.in, Voter Helpline App లో చేసుకోవచ్చన్నారు.

స్పెషల్ వెరిఫికేషన్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపేట్: ఓటర్ల నమోదు, అడ్రస్, పేర్ల మార్పులకు స్పెషల్ వెరిఫికేషన్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు బాచుపల్లి మండల తహసీల్దార్ పూల్ సింగ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా బూత్‌లలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే ఈ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్నచైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: కొంపల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు గంగాస్థాన్ కాలనీలో రూ.26 లక్షల నిధులతో వేయన్ను బీటీ రోడ్డు పనులకు ఆయన స్థానిక కౌన్సిలర్ చింతల రవీందర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ స్థానికంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శలు చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ చింతల లక్ష్మి తదితరులు ఉన్నారు.

నేడు దివ్యాంగుల బస్ పాస్‌ల స్పెషల్ మేళా

జగద్గిరిగుట్ట: దివ్యాంగుల బస్‌పాస్‌ల స్పెషల్ మేళా జగద్గిరిగుట్ట బస్టాండ్‌లోని ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు టీఎస్ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ బస్‌పాస్ పొందడానికి దివ్యాంగులు ఓ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐడీకార్డు తీసుకొని రావాలన్నారు. సర్వీస్ చార్జ్ రూ.50 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్, మగ్దూం నగర్, సోమయ్యనగర్ దేవమ్మ బస్తీ, అంజయ్యనగర్, వెంకటేశ్వరనగర్, రాజీవ్ గృహకల్ప, మైసమ్మ నగర్, భూదేవి హిల్స్, కూనా మహాలక్ష్మి నగర తదితర ప్రాంతాలలో నివసించే దివ్యాంగుల ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

పెలికాన్ సిగ్నల్స్ ప్రారంభం



లయోలా కాలేజీ సమీపంలో సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: పాదచారులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు పెలికాన్ సిగ్నల్స్ దోహద పడతాయని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ కె.వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం సుచిత్ర సర్కిల్‌లోని లయోలా కాలేజీ వద్ద పెలికాన్ సిగ్నల్స్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మేడ్చల్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలోని మరిన్ని ట్రాఫిక్ రద్దీ ప్రదేశాల్లో పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయనున్నామని వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్‌ఐలు ప్రశాంత్‌రెడ్డి శ్యామ్‌బాబు, లయోలా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన ఐటీ పోలీసులు

మాదాపూర్: కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను ఐటీ పెట్రోలింగ్ పోలీసులు కాపాడారు. జీడిమెట్ల చింతల్‌కి చెందిన భాగ్యలక్ష్మి (29) కుటుంబకలహాల వల్ల శుక్రవారం మాదాపూర్‌లోని కేబుల్‌బ్రిడ్జిపై నుంచి దూకడానికి ప్రయత్నిస్తుండగా అటువైపుగా వస్తున్న ఐటీ పోలీసులు వెంటనే గమనించి పట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి తన భర్త సిద్ధుకి అప్పగించారు.

ఆరంభ శూరత్వం

- తూతూమంత్రంగా 'ప్రతి ఆదివారం 10నిమిషాలు 10గంటలకు'కార్యక్రమం



ఐడీపీఎల్ రోడ్డులో రోజుల తరబడి నిల్వ ఉన్న నీరు..



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డును ఆనుకుని దుర్గంధభరితంగా ఉన్న దృశ్యం..

రంగారెడ్డినగర్: దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రతి ఆదివారం 10 నిమిషాలు ఉదయం 10గంటలకు'కార్యక్రమం ఆరంభం శూరత్వమే అన్న చందంగా మారుతోంది. పారిశుద్ధ్య, ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ల సమన్వయ లోపం సుస్పష్టంగా కనిపిస్తోంది. 2022, జులై 31న ప్రారంభించిన ఈ కార్యక్రమం మొదట్లో కాలనీలు, బస్తీల ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినా ఈ తరువాత అధికారుల్లో చిత్తశుద్ధి లోపించింది. గాజుల రామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రహదారుల వెంబడి పేరుకుపోతున్న మురుగునీరు, రోడ్ల వెంబడి ఖాళీ ప్రదేశాల్లో దర్శనమిస్తున్న ఖాళీ కొబ్బరి బొండాలనే నిదర్శనంగా పేర్కొనవచ్చు.

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా..

ప్రతి ఏడాది జులై నెలలో ప్రారంభమయ్యే వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరుగుతుంది. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో, వర్షం నీరు చేరిన ఖాళీ కొబ్బరి బొండాలు, బాటిళ్లు, బహిరంగ ప్రదేశాల్లో పారవేసే ఇతర సామగ్రిలు దోమల బ్రీడింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో దోమలు కట్టడంతో ప్రజలు మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు బారిన పడుతూ వస్తున్నారు. దోమల వ్యాప్తిని అరికట్టాలనే ఉద్దేశంతోనే జీహెచ్ఎంసీ అధికారులు ప్రతి ఆదివారం ఉదయం 10గంటల 10నిముషాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాలనీలు, బస్తీల్లో ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్న అధికారులు ఖాళీ ప్రదేశాలు, రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త విషయంలో మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

కానరాని ఎంటమాలజీ సిబ్బంది..

నీరు నిల్వ ఉన్న ఖాళీ ప్రదేశాలు, ఇళ్లల్లోని నీటిని నిల్వ ఉంచే సంపుల్లో దోమలు వృద్ధి చెందకుండా మలేరియా బాల్స్, ఫాగింగ్‌లు నిర్వహించాల్సి ఉన్నా ఎంటమాలజీ సిబ్బంది ఆ దిశగా పని చేయడం లేదు. మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యే సమయాల్లో మాత్రమే హడావుడి చేస్తూ మొక్కుబడిగా ఫాగింగ్, మలేరియా బాల్స్ వేయడం పరిపాటిగా మారింది. జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 144 మంది ఎంటమాలజీ సిబ్బందితో పాటు వారిపై ఓ పర్యవేక్షణాధికారి ఉన్నా దోమల నివారణ సాధ్య పడటం లేదు.

బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారాలు..

జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 857 మంది పారిశుద్ధ్య సిబ్బంది పని చేస్తున్నా ప్రధాన రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతోంది. అదే విధంగా ఖాళీ ప్రదేశాల్లో పారవేస్తున్న ఖాళీ కొబ్బరి బొండాలు, ఇతర పనికిరాని స్క్రాప్‌ను తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పరోక్షంగా వ్యాధులు ప్రబలడానికి కారణభూతమవుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెరిగిన వైరల్ కేసులు..

జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న సూరారం, షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పతుల్లో దోమకాటుతో వైరల్ జ్వరాల బారిన పడి చికిత్స నిమిత్తం వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.. ఒక్కో ప్రభుత్వ ఆస్పత్రిలో 90 మందికి పైగా, బస్తీ దవాఖానాల్లో 40 మంది వరకు వివిధ కారణాలతో జ్వరాల బారిన పడి చికిత్స నిమిత్తం వస్తుండటం గమనార్హం. ఇక ప్రైవేట్ ఆస్పతులకు వెళ్తున్న వారి సంఖ్య రెండు మూడింతలు ఉంటోందన్నది విశ్వసనీయ సమాచారం.



చింతల్- షాపూర్‌నగర్ రోడ్డును ఆనుకుని హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో మురుగు, చెత్త..

ప్రజలకు మెరుగైన వసతులను కల్పిస్తాం



సీసాల బస్తీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సోమయ్యనగర్‌లో రూ.13 లక్షలతో కమ్యూనిటీ హాలు, రింగ్ బస్తీలో రూ.12 లక్షలతో, సీసాల బస్తీలో రూ.17 లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కాలనీ, బస్తీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఎన్ని నిధులు ఖర్చయినా ప్రజలకు మెరుగైన వసతులను కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, రషీద్, కృష్ణగౌడ్, వేణుయాదవ్, పాపులు గౌడ్, విఠల్ ముదిరాజ్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

◆ సుభాష్‌నగర్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో రూ.3కోట్ల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, డీజీఎం అప్పలనాయుడు, ఏఈ సురేందర్ నాయక్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మన్నె రాజు, మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగరావు, డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

కుత్బుల్లాపూర్: అసెంబ్లీ సాక్షిగా చేసిన హామీని నిలబెట్టుకోలేని మోసకారి సీఎం కేసీఆర్ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన దీక్షకు శుక్రవారం ఆయన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ అధికారంలో వచ్చిన వెంటనే ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేస్తామన్న కేసీఆర్ తొమ్మిదేళ్లుగా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే ఒక్కసారి కూడా ఔట్‌సోర్సింగ్ కార్మికుల విషయమై అసెంబ్లీలో ప్రస్తావించలేదని తెలిపారు. ఎన్నికలు జరుగకముందే కార్మికులను పర్మనెంట్ చేసి గౌరవప్రదమైన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు లాల్ మహమద్, రహమాన్, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి...

నిజాంపేట్: ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తమను పర్మనెంట్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, వివిధ విభాగాల ఔట్ సోర్సింగ్ సిబ్బంది తమను క్రమబద్ధీకరించాలని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సంతోష్, సాయి, ప్రసాద్, రమేష్, దుర్గేష్, రామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కార్మికుల దీక్షలో కూర్చున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజును కలిసిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు శుక్రవారం ఎమ్మెల్సీ కార్యాలయానికి వచ్చి స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. కార్పొరేటర్ రావుల శేషగిరి గాజులరామారం డివిజన్‌కు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు.

◆ ఇదే సమయంలో ఎమ్మెల్సీ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను పలువురు శాలువలతో సత్కరించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి విషయంపై పలువురు వినతి పత్రాలు అందజేయగా అధికారులతో ఫోన్లలో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ రాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ పనిచేసే నాయకులనే ఎన్నుకోవాలన్నారు. కేవలం ఎన్నికల సమయంలో కనిపించే నాయకులకు బుద్ధి చెప్పాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నేడు గద్దర్ సంస్మరణ సభ

చింతల్: ప్రజాయుద్ధ నౌక, ప్రజా గొంతుక గద్దర్ సంస్మరణ సభను శనివారం నిర్వహించనున్నట్లు ప్రముఖ కవి, గాయకుడు నిషాని చందర్ ఓ ప్రకటనలో తెలిపారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సాయంత్రం 6గంటలకు జరిగే గద్దరన్న సంస్మరణ సభకు గద్దర్ కుమార్తె వెన్నెల ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



మహిళలకు పసుపుబొట్టు ఇస్తూ..

సుభాష్‌నగర్: శ్రావణమాస రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు సుమంగళిగా ఉండేందుకు పసుపు బొట్టును పరస్పరం ఇచ్చుకున్నారు.

నేడు ఎంజీఐటీలో అలుమ్ని మీట్

మణికొండ: ఎంజీఐటీ కళాశాలలో శనివారం సాయంత్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం (అలుమ్ని మీట్) నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులతో పాటు కళాశాల చైర్మెన్ డి. ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయరాణే

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మహారాష్ట్ర అసెంబ్లీ బొర్వెల్లి ఎమ్మెల్యే సునీల్ దత్తాత్రేయరాణే అన్నారు. విధాన సభ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గాజులరామారం బీజేపీ అసెంబ్లీ కార్యాలయం నుంచి శ్రీనివాస్‌నగర్, జగద్గిరిగుట్ట, రంగారెడ్డినగర్, ఐడీపీఎల్‌ల మీదుగా షాపూర్ నగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సునీల్ దత్తాత్రేయ రాణే, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ మల్లారెడ్డి, బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు.

◆ కుత్బుల్లాపూర్‌లో కషాయ జెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలు కష్టించి పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రవాస్ యోజన ప్రభారీ ఎంఎస్ వాసు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చండీ శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్, రవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘుపతి, సురేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు రాజేశ్వర్‌రావు, దుర్యోధనరావు, సాయినాథ్, కంది శ్రీరాములు, పరుష వేణు, డివిజన్ ఇన్‌చార్జులు మోతె శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, కృష్ణ యాదవ్, బిల్లా, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి భానుచందర్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, యువ మోర్చా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్



బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలోని ఎంఎన్‌కే విటాస్ విల్లాస్, దూలపల్లి రోడ్డు, నాగార్జున హోమ్స్, నూజివీడు సీడ్స్ కంపెనీ, అశ్విని కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ కాలనీ, శాంతినికేతన్ విల్లాస్, అప్పలరాజు మహేంద్ర షోరూమ్, అపర్ణ వీ-3 విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

'మనూ'లో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత కోచింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీఎస్ఈ-ఆర్‌సీఏ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్ అలీమ్ భాషా శుక్రవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ (సీఎస్ఈ-ఆర్‌సీఏ) ద్వారా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు-2024 కోసం హస్టల్ సౌకర్యంతో కూడిన ఉచిత కోచింగ్ అందిస్తుందన్నారు.. అందుకోసం దరఖాస్తులను అర్హులైన వారి నుంచి సమర్పించడానికి చివరి తేదీ సెప్టెంబర్ 4గా నిర్ణయించామన్నారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలలో ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రవేశ పరీక్షను సెప్టెంబర్ 17న నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పరీక్షలలో ఎంపికైన వారికి కోచింగ్ తరగతులను అక్టోబర్ 16వ తేదీ నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. వివరాలకు 6303582771, 9441428108, 8374627871 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ప్రమాదాలను తగ్గించేందుకు పెలికాన్ సిగ్నల్స్

గచ్చిబౌలి: పాదాచారుల ప్రమాదాలను తగ్గించేందుకు 'పెలికాన్ సిగ్నల్స్' ఏర్పాటు చేశామని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మాదాపూర్ జోన్‌లో గూగుల్ ఆఫీస్ ముందు సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పెలికాన్ సిగ్నల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు దాటుతున్న పాదాచారులు ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాలు కావడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించాలనే లక్ష్యంతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 44 చోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సిగ్నల్ వద్ద ఇద్దరు వార్డెన్‌లు విధులు నిర్వహిస్తారని, 88 మంది వార్డెన్స్‌కు టీటీఐలో వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని వివరించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సిగ్నల్స్ సత్ఫలితాలు ఇస్తే మరిన్ని పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. పాదాచారులు భద్రత కోసం సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌లో పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

కుక్క ప్రాణం తీసిన పైసల పంచాయితీ

- 'ఇద్దరి మధ్య ఆర్థిక వివాదం.. కుక్క మృతికి కారణమైంది'
- దాడి యత్నించడంతో వారిపై కుక్కను ఉసిగొల్పిన యజమాని
- ముగ్గురిని కరవడంతో మిగతా వారు రాళ్లతో కొట్టి చంపిన వైనం

జీడిమెట్ల: ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదం ఓ పెంపుడు కుక్క మృతికి కారణమైంది. ఓ వర్గం వారు తన సంస్థపై దాడి చేసేందుకు యత్నించడంతో సంస్థ యజమాని పెంపుడు కుక్కను వారిపైకి ఉసిగొల్పాడు.సదరు కుక్క ముగ్గురిని కరవడంతో అక్కడే ఉన్న మరికొంత మంది శునకాన్ని రాళ్లతో కొట్టి చంపిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది.

◆ స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ యజమాని అతడికి తెలిసిన వ్యక్తి వద్ద సుమారు రూ.4కోట్లు అప్పుగా తీసుకున్నాడు. అప్పు కోసం తన పరిశ్రమను అప్పు ఇచ్చిన వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఒప్పందం రాసుకున్నారు. దీనికి కొన్నేళ్లు గడువు పెట్టుకున్నాడు. గడువుకు ముందే సదరు సంస్థ తనకు ఇవ్వాలంటూ అప్పు ఇచ్చిన వ్యక్తి తీసుకున్న వ్యక్తిపై ఒత్తిడి చేశాడు.

◆ దీంతో తన సంస్థ ఆస్తులు అప్పు ఇచ్చిన దానికంటే నాలుగు ఇంతలు ఎక్కువ ఉందన్నారు. తాను ఇవ్వలేనంటూ అప్పు తీసుకున్న వ్యక్తి తేల్చి చెప్పాడు. దీంతో అప్పు ఇచ్చిన వ్యక్తి పేరుమీద ఆస్తి ఉండటంతో సంస్థను తన అధీనంలోకి తీసుకునేందుకు కొంత మందిని తీసుకుని సంస్థను స్వాధీనం చేసుకునేందుకు వచ్చాడు. దీంతో అప్పుతీసుకున్న వ్యక్తి దీనికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సంస్థ యజమాని అక్కడకు వచ్చిన వ్యక్తులపైకి తన పెంపుడు కుక్కను వదిలేశాడు. అది ముగ్గురు వ్యక్తులను కరిచింది. అక్కడే ఉన్న మిగతా వారు కుక్కను రాళ్లతో కొట్టి చంపేశారు. ఇరువర్గాలు జీడిమెట్ల ఠాణాలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. కుక్కకాటుకు గురైన వారు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.